సాక్షి విశాఖపట్నం

గురువారం, 25, మే, 2023



ప్రభుత్వ భూమి కబ్జాకు బ్రేక్

జీవీఎంసీ 88వ వార్డు పరిధి గంగవరంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేశారు. 8లో



డీఆర్ఎం తనిఖీలు

డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి బుధవారం విశాఖపట్నం–అరకు సెక్షన్‌లో తనిఖీలు నిర్వహించారు. 8లో



శరత్‌బాబుకు వీఎఫ్ఎస్ నివాళి

సీనియర్ నటుడు శరత్‌బాబు మృతికి ఏయూ హిందీ భవన్‌లో వైజాగ్ ఫిలిం సొసైటీ ఘన నివాళి అర్పించింది. 8లో

న్యూస్‌రీల్

ఏడుగురు ఆర్ఐలకు స్థానచలనం



దొండపర్తి(విశాఖ దక్షిణ): సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్, హోంగార్డ్స్ విభాగంలో ఏడుగురు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లను **బదిలీ చేస్తూ** నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ఐ అడ్మిన్‌గా ఉన్న బి.సీతారామును వెల్ఫేర్ ఆర్ఐగాను, సీఎస్‌డబ్ల్యూ నుంచి తాలాడ రమేష్‌ను సీటీసీకి, వెల్ఫేర్ నుంచి కె.రవికుమార్‌ను సీఎస్‌డబ్ల్యూకు బదిలీ చేశారు. అలాగే హోం గార్డ్స్ ఆర్ఐగా ఉన్న టి.భగవాన్‌ను ఆర్ఐ అడ్మిన్‌గాను, సీటీసీ ఆర్ఐగా ఉన్న బి.స్వర్ణలతను హోంగార్డ్స్ ఆర్ఐగాను, ఎంటీఓ ఆర్ఐగా ఉన్న పి.వెంకటేశంను క్యూఎం ఆర్ఐగాను, అక్కడ నుంచి కె.శ్రీనివాసరావును ఎంటీఓ ఆర్ఐగా నియమించారు.

ప్రభుత్వ నేత్ర వైద్యశాలలో సాయంత్రం ఓపీ సేవలు



సీతంపేట: రామాటాకీస్ రోడ్‌లో గల ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ఈవెనింగ్ ఔట్ పేషెంట్ (ఓపీ) సేవలు అందిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.విశ్వామిత్ర తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పేషెంట్లను పదే పదే తిప్పకుండా పూర్తి సేవలు అందించేలా అవసరమైన వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఆ రోజు ఏ యూనిట్ వైద్యులు ఉంటారో అదే యూనిట్ వైద్యులు సాయంత్రం ఓపీ సేవలు అందిస్తారన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ (అడ్వాన్స్‌డ్) పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మొదటి సంవత్సరం, మధ్యాహ్నం రెండో సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్(తెలుగు/ఉర్దూ) పరీక్ష జరిగింది. ఉదయం జరిగిన పరీక్షకు ఉమ్మడి విశాఖ జిల్లాలో 99 కేంద్రాల్లో 12,369 మంది విద్యార్థులకు గాను 11,465 మంది హాజరయ్యారు. 92.69 శాతం మంది హాజరైనట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి పి.ఉమారాణి తెలిపారు. మధ్యాహ్నం 3,314 మందికి గాను 3,003 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 90.62 శాతం హాజరు నమోదైంది. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని అధికారులు విస్తృత ప్రచారం చేయటంతో, విద్యార్థులు కేంద్రాలకు ముందుగానే చేరుకున్నారు. తొలిరోజు ఎటువంటి మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదని ఆర్ఐవో ఉమారాణి తెలిపారు.

ఈఎన్‌సీ అనుబంధ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న వైస్ అడ్మిరల్ బిశ్వజిత్ దాస్‌గుప్తా

సింధియా : తూర్పు నావికా దళ అధికారులు, నావికులు, డిఫెన్స్ సివిలియన్ల అవసరాలకు ఉపయోగపడేలా తూర్పు నావికాదళ ప్రధాన కార్యాలయానికి అనుబంధంగా నిర్మించిన భవనాన్ని వైస్ అడ్మిరల్ బిశ్వజిత్ దాస్‌గుప్తా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భవన నిర్మాణంతో దీర్ఘకాలంగా నేవీ సిబ్బంది ఎదురుచూస్తున్న అత్యాధునిక వసతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. పర్యావరణానుకూలంగా, సాధ్యమైనంత ఎక్కువగా సౌరశక్తిని వినియోగించుకుని, గాలి వెలుతురు వచ్చేలా, క్రాస్ వెంటిలేషన్ ఉండేలా ఈ భవనాన్ని నిర్మించినట్టు తెలిపారు. భవనానికి కావలసిన విద్యుత్ అవసరాలను తీర్చేందుకు సౌరశక్తి ప్లాంట్‌తోపాటు, వర్షపు నీటిని సంరక్షించేలా నిర్మాణం జరిగిందన్నారు. ఈ భవనాన్ని ఎంఈఎస్ పర్యవేక్షణలో మెస్సర్స్ కేఈసీ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నిర్మించినట్లు వెల్లడించారు.

ఈ నోటు మాకొద్దు



- రూ.2 వేల నోట్లు తీసుకోబోమని కొన్ని పెట్రోల్ బంకుల్లో బోర్డులు
- మరికొన్ని దుకాణాలు, షాపింగ్ మాల్స్‌లోనూ నిరాకరణ
- బ్యాంకుల్లో పది రెట్లు పెరిగిన ఈ నోట్ల డిపాజిట్లు



రూ.2వేల నోట్లు తీసుకోబోమని పెట్రోల్ బంకులో అంటించిన స్టిక్కర్

సాక్షి, విశాఖపట్నం: ఇన్నాళ్లూ రెండు వేల రూపాయల నోటు కోసం చాలామంది అర్రులు చాచేవారు. ఎక్కడికైనా ఎక్కువ మొత్తంలో సొమ్ము తీసుకువెళ్లాలంటే ఈ నోట్లు సులభతరంగా ఉండడం వల్ల మొగ్గు చూపేవారు. ఇలా ఈ నోట్లు తమ ప్రత్యేకతను చాటుకునేవి. కానీ ఇప్పుడు వీటిని వదిలించుకోవడానికి తంటాలు పడాల్సి వస్తోంది. ఇందుకోసం అనేక మార్గాలను అన్వేషిస్తున్నారు. చలామణి నుంచి ఈ నోటును ఉపసంహరిస్తూ ఇటీవల ఆర్బీఐ నిర్ణయం తీసుకుంది. బ్యాంకుల నుంచి వీటి జారీని నిలిపివేసింది. రూ.2 వేల నోటును ఈనెల 23 నుంచి సెప్టెంబర్ 30 వరకు మార్చుకోవడానికి, బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకోవడానికి వీలు కల్పించింది. అలాగే తమ వద్ద ఉన్న వీటిని రోజుకు రూ.20 వేల వరకు మార్చుకోవడానికి అనుమతించింది. దీంతో వీటి చలామణికి చిక్కొచ్చి పడింది. ఇప్పటివరకు ఈ నోట్లు ఉన్న వారంతా నిశ్చింతగా ఉన్నారు. ఆర్బీఐ నిర్ణయంతో వీటి చలామణికి తొందర పడుతున్నారు. నిన్న మొన్నటి వరకు పెట్రోల్ బంకుల్లో రూ.2 వేల నోట్లను తీసుకునే వారు. ఇన్నాళ్లూ రోజుకు సగటున ఒక బంకులో 20 వరకు రూ.2 వేల నోట్లు రాగా వీటి చలామణి ఉపసంహరించాక పది రెట్లు పెరిగాయి. రూ.2 వేలు ఇచ్చి రూ.200–300 చమురు వేయించుకొని నోటును మార్చుకునే వారు. రోజురోజుకు బంకుల్లో చలామణి పెరిగి పోతుండడంతో రెండ్రోజుల నుంచి కొంతమంది యజమానులు వీటిని తీసుకోవడం లేదు. ఆయా బంకుల్లో 'రూ.2 వేల నోటు తీసుకోబడదు' అనే స్టిక్కర్లను అతికిస్తున్నారు.

'నా ఎనిమిది గంటల డ్యూటీలో రోజుకు 2–3 రూ.2 వేల నోట్లు వచ్చేవి. ఇప్పుడవి 30 వరకు వస్తున్నాయి. రెండ్రోజుల నుంచి మేం వీటిని తీసుకోవడం లేదు' అని అక్కయ్యపాలెంలోని ఓ పెట్రోల్ బంకులోని రమేష్‌రెడ్డి అనే పంపింగ్ బాయ్ 'సాక్షి'కి చెప్పాడు. అలాగే కొన్ని వ్యాపార దుకాణాలు, షాపింగ్ మాల్స్‌లోనూ ఈ నోట్లను నిరాకరిస్తున్నారు. కాగా ఈ నోట్ల మార్పిడికి కొంతమంది ధనికులు బంగారం కొనుగోళ్లకు ఎగబడుతున్నారు. అయితే పెద్దపెద్ద జ్యుయలరీ మాల్స్‌లో రూ.2 వేల నోట్లను తీసుకుంటున్నారు. కానీ రెండు మూడు రోజుల నుంచి విశాఖలోని బంగారం వర్తకులు ఈ నోట్లను తీసుకోవడం లేదు. వీటిని తీసుకుంటే తమకు బ్యాంకుల్లో జమ చేయడానికి ఇబ్బంది ఎదురవుతుందన్న ఉద్దేశంతో నిరాకరిస్తున్నామని శ్రీనివాస్ అనే బంగారం వ్యాపారి 'సాక్షి'తో చెప్పారు.

బ్యాంకుల్లో భారీగా పెరిగిన డిపాజిట్లు

మరోవైపు బ్యాంకుల్లో రూ.2 వేల నోట్ల డిపాజిట్లు భారీగా పెరుగుతున్నాయి. ఆర్బీఐ నిర్ణయానికి ముందుతో పోల్చుకుంటే సగటున పది రెట్లకు పైగా పెరుగుదల కనిపిస్తోందని బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. కైలాసపురం ఎస్‌బీఐలో రోజుకు రూ.లక్ష లోపే ఈ నోట్ల డిపాజిట్ జరిగేది. ఇప్పుడది రూ.10 లక్షలకు పైగా ఉంటోందని ఆ బ్రాంచి చీఫ్ మేనేజర్ పరమేశ్వర శ్రీనివాస్ 'సాక్షి'కి చెప్పారు. మరికొందరు క్యాష్ డిపాజిట్ మిషన్ల (సీడీఎంల) ద్వారా జమ చేస్తున్నారు. అలాగే యూనియన్ బ్యాంకులోనూ డిపాజిట్లు గతంకంటే ఏడెనిమిది రెట్లు పెరిగిందని ఆ బ్యాంకు అధికారి ఒకరు తెలిపారు. అలాగే బ్యాంకుల్లో నోట్ల మార్పిడి ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోందని చెప్పారు. కొన్ని బ్యాంకుల్లో ఈ నోట్ల మార్పిడి చేసే వారి పేర్లు, ఫోన్ నంబర్లను తీసుకుంటున్నారు. మొత్తమ్మీద ఆర్బీఐ నిర్ణయంతో తమ వద్ద ఉన్న రూ.2 వేల నోట్లను ఎలా వదిలించుకోవాలన్న దానిపైనే అంతా మల్లగుల్లాలు పడుతున్నారు. మరికొందరు ఈ బ్లాక్ మనీని వైట్‌గా ఎలా మార్చుకోవాలంటూ నిపుణులతో చర్చిస్తున్నారు.

టాస్క్‌ఫోర్స్ దూకుడు

- **సాక్షి వరుస కథ**నాలతో సీపీ సీరియస్
- **ఆయన ఆదేశాల**తో బుచ్చిరాజుపాలెంలో **పేకాట శిబిరంపై** దాడులు
- **21 మంది అరెస్ట్**, రూ.1.01 లక్షల నగదు, **7 వాహనాలు,** 22 ఫోన్లు స్వాధీనం



సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో పేకాడుతున్న జూదరులు

కరెంట్ వెలుగుల్లేవు. కొండపై చుట్టూ చీకటి. కిరోసిన్ దీపాలకు ఆస్కారం లేదు. అయినా అవేవీ వారికి 'ఆట'పై ఉన్న మక్కువను తగ్గించలేకపోయాయి. అందుబాటులో ఉన్న సెల్‌ఫోన్ లైట్లలోనే తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించుకున్నారు. ఇదే శ్రమ పనికొచ్చే పనికి చేస్తే పతాక శీర్షికల్లో నిలిచేవారు. చదువుపై ఈ శ్రద్ధ కనబరిస్తే వీధిలైట్ల వెలుగులో చదువుకున్న మహానుభావుల సరసన చేరేవారు. కానీ వారు చూపింది పేకాటపై. దీంతో వీరి తీరుకు ఆశ్చర్యపోవడం నగర పోలీసుల వంతయింది.

గోపాలపట్నం : పేకాట శిబిరాలపై టాస్క్‌ఫోర్స్ దూకుడు పెంచింది. నగరంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట డెన్లపై దాడులు చేపడుతోంది. 'కళావర్ కింగ్', 'మసాజ్ పోలీస్ మస్త్ వసూల్' పేరిట 'సాక్షి' వరుస కథనాలతో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ స్పందించారు. పోలీసుల తీరుపై కన్నెర్ర చేశారు. విశాఖలో గంజాయి, జూదం నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వీటిని అరికట్టే విషయంలో కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. దీంతో గత కొద్ది కాలంగా స్తబ్దుగా ఉన్న టాస్క్‌ఫోర్స్ మళ్లీ వేగం పెంచింది. వారం రోజులుగా గంజాయి, మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న వారికి చెక్‌పెడుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. తాజాగా 'సాక్షి' కథనాలతో పేకాట డెన్లపై దృష్టి సారించారు. ఈ క్రమంలో ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట డెన్‌పై దాడులు నిర్వహించారు.

సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో పేకాట

ఫ్లడ్‌లైట్ల వెలుతురులో క్రికెట్, ఫుట్‌బాల్ వంటి క్రీడలు ఆడడం సహజం. కానీ వీళ్ల చతుర్ముఖ పారాయణం కోసం వినియోగించిన వెలుతురు పోలీసులను విస్మయానికి గురిచేసింది. హోటళ్లు, లాడ్జిలు, ఇళ్లలో నిర్వహించే పేకాట డెన్లపై పోలీసులు దాడులు చేస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో పగటి పూట ఆడుతున్నా పట్టేస్తున్నారు. దీంతో వీరు సరికొత్తగా ఆలోచించారు. బుచ్చిరాజుపాలెం 90వ వార్డు పరిధిలో శాంతినగర్ దుర్గమ్మ గుడి వెనుక కొండవాలు ప్రాంతంలో రాత్రి సమయాల్లో పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. అక్కడ లైటింగ్ లేనప్పటికీ సెల్‌ఫోన్ ఫ్లాష్ లైట్లు, చార్జింగ్ లైట్ల వెలుతురులో పేకాట కొనసాగిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం రాత్రి ఆ పేకాట శిబిరంపై దాడులు చేశారు. వీరి తీరుకు పోలీసులే ఆశ్చర్యపోయారు. 21 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,01,190 నగదు, ఒక ఆటో, 6 బైకులు, 22 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న డెన్ నిర్వాహకుడు శ్రీనివాస్‌ను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు గుర్తించారు. ఈయనకు సహకరిస్తున్న వెంకటేష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలు

మహారాణిపేట : వైద్య ఆరోగ్యశాఖలో సిబ్బందికి మ్యూచువల్(పరస్పర) బదిలీలు బుధవారం నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో ఉన్న రీజనల్ డైరెక్టర్(ఆర్‌డీ) డాక్టర్ ఎస్.ఉమాసుందరి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులు, ఎంఎల్‌హెచ్‌పీలకు బదిలీ ప్రక్రియ చేపట్టారు. ఇందులో 140 మందికి పరస్పర బదిలీలు జరిగాయి.

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

మహారాణిపేట : రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మరుమూడి విక్టర్ ప్రసాద్ గురువారం విశాఖ రానున్నారు. రోడ్డు మార్గం ద్వారా వస్తున్న ఆయన రాత్రి 7.30 గంటలకు హిందుస్థాన్ షిప్‌యార్డు చేరుకొని అక్కడ బస చేస్తారు. 26న స్థానికంగా జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం రాత్రి 9 గంటలకు రోడ్డు మార్గం ద్వారా మచిలీపట్నం బయలుదేరనున్నారు.

ఉన్నత విద్యకు భరోసా.. విద్యాదీవెన

- జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున
- జిల్లాలో 41,075 మంది విద్యార్థులకు రూ.37 కోట్ల లబ్ధి



నమూనా చెక్కును అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ కల్యాణి తదితరులు

విశాఖ విద్య : జగనన్న విద్యాదీవెన విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసాగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. జనవరి–మార్చి త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యాదీవెన నిధులను బుధవారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ మేరకు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సీఎం సమావేశాన్ని ప్రత్యక్షప్రసారం ద్వారా జిల్లా అధికారులు వీక్షించారు. అనంతరం జిల్లాలోని 41,075 మంది విద్యార్థులకు రూ.36 కోట్ల 92 లక్షల 71 వేల 992 మొత్తాన్ని నమూనా చెక్కు రూపంలో లబ్ధిదారులకు కలెక్టర్ మల్లికార్జున అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాదీవెనకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ నవరత్నాలు పథకాలతో బడుగు బలహీన వర్గాలకు నిరంతరం అండగా ఉంటూ, ప్రతి ఒక్కరి భవిష్యత్‌కు సీఎం జగన్ అండగా నిలుస్తున్నట్టు తెలిపారు. ఉన్నత చదువుల్లో ఉత్తమంగా రాణించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ పేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదవాలన్న సమున్నత లక్ష్యంతో కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల్ని క్రమం తప్పకుండా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో సీఎం జగన్ నేరుగా జమ చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ డి.వి.రమణమూర్తి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి శ్రీదేవి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జ్ పూర్ణిమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కేటగిరీ	విద్యార్థులు	లబ్ధి
జీసీ	33,157	రూ.29.01 కోట్లు
ఈబీసీ	4,640	రూ.4.73 కోట్లు
కాపు	1,418	రూ.1.38 కోట్లు
ముస్లిం మైనార్టీ	1,252	రూ.1.09 కోట్లు
క్రిస్టియన్ మైనార్టీ	221	రూ.25 లక్షలు
ఎస్సీ	207	రూ.30.35 లక్షలు
ఎస్టీ	180	రూ.14.60 లక్షలు

మూడో ప్రయత్నంతో మెరిసెన్

సివిల్స్‌లో 315వ ర్యాంక్ సాధించిన ఆశ్రిత



తాటిచెట్లపాలెం: మొదటి రెండు ప్రయత్నాల్లో విఫలం ... అయినా ప్రయత్నం ఆపలేదు. ఆత్మవిశ్వాసం సడలలేదు. అదే విశ్వాసంతో, సాధించాలనే పట్టుదలతో మూడో ప్రయత్నం కొనసాగించి, సివిల్స్‌లో 315 ర్యాంకు సాధించింది. ఆమె మరెవరో కాదు. నగరానికి చెందిన నౌపడ ఆశ్రిత. విశాఖలో సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన ఆమె ప్రాథమిక విద్యాభ్యాసం రైల్వేన్యూకాలనీలో ఉన్న హరగోపాల్ స్కూల్లో జరిగింది. ఇంటర్ బైపీసీ నారాయణ కళాశాలలో చదివింది. ఆదిత్య డిగ్రీ కాలేజీ నుంచి డిగ్రీ పూర్తి చేసింది. 2019లో ప్రైవేట్ ఉద్యోగంలో చేరింది. అక్కడి నుంచి సివిల్స్ ర్యాంక్ సాధన వరకు తన ప్రయాణాన్ని 'సాక్షి'కి ఆమె తెలిపింది. ఆమె మాటల్లోనే.. ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నప్పుడే సోషల్ వర్క్ పట్ల ఆసక్తి పెరిగింది. ఎందుకు సివిల్ సర్వెంట్‌గా మారి ఎక్కువమందికి సేవ చేయకూడదని అప్పుడే నిర్ణయించుకున్నా. వెంటనే సివిల్స్ కోచింగ్ కోసం ఢిల్లీకి వెళ్లా. కోవిడ్ కారణంగా కోచింగ్ మధ్యలోనే ఆగిపోయింది. తిరిగి ఇంటికి చేరుకున్నా. ఇంటి దగ్గరే చదివి, రెండు సార్లు సివిల్స్ రాశాను. కానీ ప్రిలిమ్స్ కూడా అర్హత సాధించలేకపోయా. ఈసారి పట్టుదల పెరిగింది. మళ్లీ కోచింగ్ తీసుకున్నాను. 2022లో సివిల్స్ మూడో అటెంప్ట్ చేశా. తాజాగా విడుదలైన ఫలితాల్లో 315వ ర్యాంకు వచ్చింది. ఈ ర్యాంక్‌కు జనరల్ కేటగిరీలో ఐఏఎస్‌కు ఎంపిక కానని తెలుసు. అందుకే మరోసారి మెరుగైన ర్యాంకు కోసం ఈనెల 28న జరిగే ప్రిలిమ్స్‌కు హాజరుకానున్నట్టు ఆశ్రిత పేర్కొంది. తండ్రి ప్రైవేట్ ఉద్యోగి, తల్లి గృహిణి. తల్లితండ్రుల ప్రోత్సాహం, పక్కా ప్రణాళిక, అధ్యాపకుల శిక్షణ తనను ఈ స్థాయికి తీసుకొచ్చాయని తెలిపింది.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎంప్లాయ్‌మెంట్ అధికారులు కె.సుధ(టెక్నికల్), సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. హీరో మోటోకార్ప్స్, భారత్ ఎఫ్ఐహెచ్ లిమిటెడ్, మోహాస్ స్పింటెక్స్, టీమ్ లీజ్(ఎస్‌బీఐ కార్డ్స్) బజాజ్ ఆల్కెమ్, టీజెఎల్ ఎన్‌డీటీ టెక్నాలజీస్ తదితర కంపెనీల్లో 390 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లమా, బీకామ్(టాలీ), బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. జీతం నెలకు రూ.పది వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ncs.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

ఏపీ 'మా' అధ్యక్షుడిగా దాడి


మాట్లాడుతున్న దాడి సత్యనారాయణ

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా నగరానికి చెందిన దాడి సత్యనారాయణ ఎన్నికయ్యారు. స్థానిక బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సింధూర గెస్ట్‌హౌస్‌లో సంఘ సర్వసభ సమావేశం బుధవారం నిర్వహించారు. నూతన కమిటీ ఎన్నికలు జరిపారు. కార్యదర్శిగా వర్రె నాంచారయ్య, కోశాధికారిగా పాండాతో పాటు సభ్యుల్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా దాడి సత్యనారాయణ మాట్లాడుతూ కళాకారుల్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కళాకారుల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, తేజ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు నగరానికి అల్లం అప్పారావు భౌతికకాయం

ఏయూక్యాంపస్: ఇటీవల అమెరికాలో మృతి చెందిన జేఎన్‌టీయూకే పూర్వ ఉపకులపతి ఆచార్య అల్లం అప్పారావు భౌతికకాయం గురువారం ఉదయం నగరానికి చేరుకోనుంది. హైదరాబాద్ నుంచి ఉదయం 10 గంటల సమయంలో విశాఖకు భౌతిక కాయం చేరుకుంటుందని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల వరకు లాసన్స్‌బే కాలనీలోని ఆయన నివాసంలో భౌతిక కాయాన్ని ఉంచుతారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో అంతిమయాత్ర ప్రారంభించి జ్ఞానాపురం వద్దనున్న శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

శరత్‌బాబుకు వీఎఫ్‌ఎస్ ఘన నివాళి

ఏయూక్యాంపస్ : సీనియర్ నటుడు శరత్ బాబు మృతికి ఏయూ హిందీ భవన్‌లో వైజాగ్ ఫిలిం సొసైటీ బుధవారం ఘన నివాళి అర్పించింది. సంస్థ అధ్యక్షుడు ఆచార్య ఎన్‌పీడీ పాల్, కార్యదర్శి నరవ ప్రకాశరావు తదితరులు శరత్ బాబు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శరత్‌బాబు తన 71 ఏళ్ల సినీ కెరీర్‌లో 250 చిత్రాల్లో నటించి, ప్రేక్షకుల్ని మెప్పించారని కొనియాడారు. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా దాదాపు ఐదు దశాబ్దాలు సినీ పరిశ్రమలో నిలదొక్కుకోవడం శరత్‌బాబుకు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు బ్రేక్

- 3.90 ఎకరాల్ని ఆక్రమించి, ఫెన్సింగ్ వేసిన వైనం
- టీడీపీ నాయకుల కబ్జాను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు


ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం : జీవీఎంసీ 88వ వార్డు పరిధి గంగవరంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేశారు. స్థానిక టీడీపీ నాయకులు 3.90 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు బుధవారం ఆ ప్రాంతానికి వెళ్లి, ఫెన్సింగ్‌ను తొలగించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వివరాలు.

గంగవరం సర్వే నెం.38లో 36.37 ఎకరాల ప్రభుత్వం భూమి ఉంది. దీనికి సమీపంలోనే సుమారు 300 ఎకరాల్లో అర్బన్ హౌసింగ్ లబ్ధిదారులకు జగనన్న కాలనీలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు గాజువాక ప్రాంతానికి సమీపంలో ఉండడంతో ఇక్కడ భూములు ధరలు ఆకాశాన్నంటాయి. దీంతో స్థానికంగా ఉన్న కొందరు కబ్జాదారుల కన్ను ఈ ప్రభుత్వ భూములపై పడింది. అందులో కొంత భూమిని గతంలోనే పేదవారికి ప్రభుత్వం కేటాయించి, డీ పట్టాలిచ్చింది. మరికొంత స్థలంలో కాలనీ ఉంది. ఇదే సర్వే నంబర్లో సుమారు 15 ఎకరాల వరకూ ఖాళీ స్థలం ఉంది. దీన్లో కొందరు పెద్దలు పాగా వేయగా, మిగిలిన భూమిలో 3.90 ఎకరాలను టీడీపీ నాయకులు ఆక్రమించి, చుట్టూ ఫెన్సింగ్ వేసేశారు. దీనిపై స్థానికులు తహసీల్దార్ బి.సత్యనారాయణకు సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు ఆర్ఐ వి.వీరయ్య మిగిలిన రెవెన్యూ సిబ్బందితో కలిసి బుధవారం ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. కబ్జాకు గురైన స్థలం చుట్టూ ఉన్న ఫెన్సింగ్ పోల్స్‌ను తొలగించారు. హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడేవారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే భూకబ్జా, పీడీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విశాఖ-అరకు సెక్షన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి బుధవారం ఆయా విభాగాల అధికారులతో కలిసి విశాఖపట్నం-అరకు సెక్షన్‌లో తనిఖీలు నిర్వహించారు. సెక్షన్ పరిధిలోని వివిధ స్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా అరకు రైల్వే స్టేషన్, రెస్ట్ హౌస్, వెయిటింగ్ హాల్స్, డార్మిటరీలు, ఇతర రైల్వే కార్యాలయాలను పరిశీలించారు. అనంతరం బొడ్డవర రైల్వేస్టేషన్‌లో పర్యటించారు. అక్కడ జరుగుతున్న రెండో లైన్ పనులను, భద్రతా సంబంధిత ఆధునికీకరణ పనులను పరిశీలించారు. పలు సూచనలిచ్చారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ పర్యటనలో డీఆర్‌ఎంతో పాటు రైల్వే ఉన్నతాధికారులు, ఇంజినీర్లు కె.డి.రావు, సుధీర్‌కుమార్ గుప్తా, ఎ.కె.మహారాణా, జి.సునీల్‌కుమార్, ఎ.కె.త్రిపాఠి, దీప్తాన్షు శర్మ, ప్రభాత్‌సింగ్, ఇతర అధికారులు, స్థానిక స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

మెరుపుల హరివిల్లు



మెరిసే మేఘమాలికపై.. రంగుల హరివిల్లు ఛత్రం పట్టింది. బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా ఆకాశాన్ని కారు మబ్బులు కమ్ముకున్నాయి. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో నగరంలో అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి. వేసవి తాపాన్ని ఉపశమించేందుకే అన్నట్టు.. అంతే వేగంగా గాలులు, మబ్బులు తగ్గుముఖం పట్టాయి. ఆ సమయంలో ఆవిష్కృతమైన అద్భుత దృశ్యాన్ని కెమెరా క్లిక్‌మనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్

ఈ శ్రమ్‌లో వివరాలు నమోదు చేసుకోండి

సీతంపేట: అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ పి.విజయకుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వ్యవసాయ కూలీలు, ఇళ్లల్లో, దుకాణాల్లో పనిచేసే వారు, తోపుడు బండి వ్యాపారులు, పాల వ్యాపారులు, చేతి వృత్తుల వారు, భవన నిర్మాణ కార్మికులు, ఈఎస్ఐ, పీఎఫ్ సభ్యత్వం లేని 16 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు ఈ శ్రమ్‌లో నమోదుకు అర్హులని తెలిపారు. ఆధార్ కార్డు, దానితో అనుసంధానమైన ఫోన్ నంబరు, బ్యాంకు అకౌంట్ పాసు పుస్తకం, నామినీ ఆధార్ కార్డుతో అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లోని కార్మిక శాఖ కార్యాలయాన్ని పనివేళల్లో సంప్రదించాలని తెలిపారు. ఈ పథకం వల్ల రూ.2 లక్షల ప్రమాద బీమా, లబ్ధిదారుల ఖాతాకు నేరుగా నగదు బదిలీ వంటి ప్రయోజనాలు లభిస్తాయన్నారు. కార్మికులు వీలైనంత త్వరగా వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.143
స్కిన్	: రూ.256
స్కిన్‌లెస్	: రూ.266

ఎస్‌ఏజీవై పనులపై దృష్టి సారించాలి


కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డా.మల్లికార్జున, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

సాక్షి, విశాఖపట్నం : సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన (ఎస్‌ఏజీవై) ద్వారా ఎంపికైన గ్రామాల్లో మొదలు పెట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ డా.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్‌ఏజీవై పర్యవేక్షణ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీల సహకారంతో ఎస్‌ఏజీవైలో చేయాల్సిన పనుల్ని గుర్తించి సంబంధిత ప్రతిపాదనలను ఎంపీడీవోలకు అందజేయాలన్నారు. ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ గ్రామాల్లో సర్వే నిర్వహించి అవసరమైన పనుల్ని ఎంపీడీవోలు గుర్తించాలని సూచించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న నిధుల లభ్యత ప్రకారం పనుల ప్రాధాన్యతలకు సంబంధించిన ప్రతిపాదనల్ని సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి, జిల్లా అధికారులతో పాటు అనంతవరం, పద్మనాభం, మద్ది, ఆనందపురం, గండిగుండం, వెల్లంకి గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లకు విశేష ఆదరణ


సమ్మర్ క్యాంపులో పాల్గొన్న చిన్నారులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లకు చిన్నారుల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ తెలిపారు. జీవీఎంసీ అన్ని జోన్ల పరిధిలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ల్లో అధిక శాతం విద్యార్థులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. మొత్తం 333 సెంటర్లలో 33 రకాల ఈవెంట్స్ జరుగుతున్నాయన్నారు. 15 రోజుల పాటు జరిగే ఈ సమ్మర్ కోచింగ్ క్యాంపుల్లో పాల్గొనే పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని చెప్పారు. వేసవి సెలవుల్లో పిల్లలు అధిక శాతం టీవీలు, సెల్‌ఫోన్‌లకు పరిమితం అవుతున్నారని, తల్లిదండ్రులు తమకు సమీపంలో నిర్వహించే సమ్మర్ కోచింగ్ క్యాంపులకు తీసుకెళ్లి పిల్లలు ఆటల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. ఆటల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు పిల్లల్లో చురుకుదనం ఏర్పడుతుందన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు

నేటి నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

మురళీనగర్ : పాలిటెక్నిక్ కాలేజీలో ప్రవేశాలకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు పాలిసెట్ జిల్లా సమన్వయకర్త కేడీవీ నరసింహారావు చెప్పారు. ఈ కౌన్సెలింగ్‌కు సంబంధించి గురువారం నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

విద్యార్థులు 1వ ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు ఈ నెల 25 నుంచి జూన్ 1వ తేదీ వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకోసం http://appolycet.nic.in లోకి వెళ్లి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

ఫీజు వివరాలు ఇవీ
బీసీ/ఇతరులకు : రూ.700,
ఎస్సీ/ఎస్టీలకు : రూ.250.
ఆన్‌లైన్ మోడ్‌లో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లించవచ్చు. నెట్‌వర్క్ సమస్యల వల్ల ఫీజు చెల్లింపులో ఇబ్బందులు ఏర్పడితే రెండో సారి చెల్లించాల్సి ఉంటుందన్నారు. మొదటి సారి ఫెయిల్ అయిన నగదు నాలుగు రోజుల్లో వెనక్కి వస్తుంది. అలా రానట్లయితే అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబరు, ట్రాన్సాక్షన్ నంబరు, ఫీజు చెల్లించిన తేదీ వివరాలను convenorpolycet2023@ gmail. comకు మెయిల్ చేసినట్టయితే తక్షణం పరిష్కరిస్తారు. ఫీజు చెల్లింపు రసీదు ప్రింటు తీసుకుని కౌన్సెలింగు సమయంలో చూపించాల్సి ఉంటుంది

షెడ్యూలు ఇలా:
- కౌన్సెలింగు ప్రక్రియ ఈ నెల 29 నుంచి ర్యాంకుల వారీగా ప్రారంభమవుతుంది.
- సర్టిఫికెట్ల పరిశీలన: మే 29 నుంచి జూన్ 6వ తేదీ
- ఆప్షన్ల ఎంపిక : జూన్ 1 నుంచి జూన్ 6వ తేదీ
- ఆప్షన్ల మార్పిడి: జూన్ 7వ తేదీ
- సీట్ల కేటాయింపు: జూన్ 9వ తేదీ

జిల్లాలో హెల్ప్‌లైన్ కేంద్రాలు (కౌన్సెలింగు కేంద్రాలు): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ, కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ.

ద్వారకానగర్‌లో రాజుగారి రుచులు


రెస్టారెంట్‌ని ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకట కుమారి, తెనాలి ఎమ్మెల్యే శివకుమార్

సీతమ్మధార : ద్వారకానగర్ మొదటి లైన్‌లోని విజయవాడ రాజుగారి రుచులు రెస్టారెంట్‌ను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, హోటల్ అధినేత డాక్టర్ దాసం లక్ష్మణరాజు హాజరై వివిధ కౌంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రెస్టారెంట్‌లో అందుబాటులో ఉన్న వెజ్, నాన్‌వెజ్ వంటకాల విశేషాలను తెలిపారు. రెస్టారెంట్ అధినేత దాసం లక్ష్మణరాజు మాట్లాడుతూ విశాఖవాసుల జిహ్వాచాపల్యాన్ని తీర్చేందుకు నాటుకోడి పులుసు, ములక్కాడ మటన్, రాగిసంగటి, దోసకాయ మటన్ తదితర వెరైటీలను అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు.

నూతన పరికరాలు ప్రారంభం


నూతన పరికరాలు ప్రారంభించి, పరిశీలిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్

తాటిచెట్లపాలెం : ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్, డివిజినల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి బుధవారం ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లో పర్యటించి పలు అదనపు వసతులు, నూతన పరికరాలు ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న లోకో వీల్ టైర్ టర్నింగ్ ఆపరేషన్‌కు సమాంతరంగా కొత్తగా అదనపు ఫిట్‌వీల్ లేత్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనివల్ల ఈ షెడ్‌లో లోకోల నిర్వహణ సమయం ఆదా అవుతుందని, అలాగే లోకోలు వేచి ఉండే సమయం కూడా ఆదా అవుతుందని అధికారులు తెలిపారు. అలాగే ఈ షెడ్‌లో ఎలక్ట్రానిక్ లేబొరేటరీని కూడా ప్రారంభించారు. ఇందులో ముఖ్య పాత్ర పోషించే ట్రాక్షన్ కన్వర్టర్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఎలక్ట్రిక్ లోకోలకు గల సింగిల్ పేజ్ ఏసీ సరఫరాను త్రీ ఫేజ్‌గా మార్చడంలో ఇది ఎంతో ఉపయోగపడుతుంది. త్రీ ఫేజ్ లోకోల కోసం కొత్తగా వచ్చిన సరకును నిల్వ చేసేందుకు నూతనంగా నిర్మించిన స్టోర్స్ గొడౌన్‌ను డీఆర్‌ఎం ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఏడీఆర్‌ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, సీనియర్ డివిజినల్ ఇంజినీర్ (కో ఆర్డినేషన్) ఏకే మహారాణా, సీనియర్ డివిజినల్ ఇంజినీర్(టీఆర్‌ఎస్) శివ నరేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దంతేవాడ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : భద్రతా కారణాల వల్ల కొత్తవలస - కిరండూల్ లైన్‌లో నడిచే పలు రైళ్ల ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నందున దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.
- కిరండూల్‌లో మే 24, 25న బయల్దేరాల్సిన కిరండూల్ - విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నంలో మే 25న బయల్దేరే విశాఖపట్నం - కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది.
- కిరండూల్‌లో మే 26న బయల్దేరాల్సిన కిరండూల్ - విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ రైలు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.